

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లాలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే క్రమంలో నగరంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శనివారం అర్ధరాత్రి ఎస్పి జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నగరంలోని పలు లాడ్జీల్లో తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్లలో, ప్రయాణం చేస్తున్న బస్సులను నిలిపి ప్రయాణికుల వివరాలు సేకరణ, బ్యాగులు తనిఖీలు చేశారు. లాడ్జీల్లో పోలీసులు ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, రాత్రి వేళల్లో లాడ్జిలల బస చేసిన వ్యక్తులను ప్రశ్నిస్తూ, వారి వివరాలపై ఆరా తీశారు. లాడ్జిల యాజమాన్యం అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఓపెన్ డ్రింకింగ్ 80 మందిపై 80 కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ 96 మందిపై 96 కేసులు, ఎం.వి. యాక్ట్ కేసులు 514 నమోదు చేశారు. సుమారుగా రూ.2,02,890/- జరిమానాలు విధించారు.

పూర్తి స్థాయిలో సాగునీటి సరఫరా

◆కలెక్టర్ ఓ ఆనంద్ ◆'రాళ్లపాడు' ప్రాజెక్టు సందర్శన
◆మంత్రి 'నిమ్మల' ఆదేశంతో కదిలిన యంత్రాంగం

ప్రజాశక్తి - లింగసముద్రం

రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ కింద వరి సాగు చేసిన రైతులకు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధి.కారులను ఆదేశించారు. ఆదివారం ఆయన రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలవను పరిశీలించారు. గత 15 రోజుల నుంచి కుడికాలువ తూము తలుపు తెరుచు కోకపోవడంతో కాలువకు నీటి సరఫరా నిలిచిపోయింది.అప్పటినుండి అధికారులు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ సమస్య కొలిక్కి రాలేదు.దీంతో సైఫను లు ద్వారా, మోటార్ల ద్వారా నీటిని కాలువకు తరలిస్తున్నారు. కాలువకు వచ్చే నీరు సరిపోకపోవడంతో కింద గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నీటి పరిమాణం పెంచేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కుడికాలు వద్ద పరిస్థితిని కలెక్టర్ కు ఇరిగేషన్ ఎస్.ఈ వరలక్ష్మి వివరించారు.తూము ద్వారా నీటిని విడుదల చేస్తేనే ఎత్తు కాలువలకు నీటి పారుదల ఉంటుందని రైతులు కలెక్టర్‌ను కోరారు. మోటార్లని 10 రోజుల ముందు ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని రైతులు కలెక్టర్ దష్టికి తెచ్చారు.నీరు రాకపోవడంతో వరినట్లు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే గేటు సమస్యను పరిష్కరిస్తామని, మెగా ఇన్ ఫ్రా నిపుణులు వచ్చి పరిశీలించారని అన్నారు.ప్రస్తుతం రైతులందరికీ నీటినందించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం కదిలింది. గత 15 రోజుల నుండి రాళ్లపాడు కుడికాలువ తూము గేటు సమస్య కొలిక్కి రాకపోవడంతో నీటి సమస్య తీవ్రమైంది. దీంతో చినపవని గ్రామానికి చెందిన కొందరు రైతులు శనివారం అమరావతిలో జల వనరుల శాఖ మంత్రి రామానాయుడుని కలిసి సమస్యను వివరించారుదీంతో కలెక్టర్ ప్రాజెక్టు వద్దకు వచ్చి కుడికాలు తూము వద్దకు వచ్చి పరిశీలించి విషయం తెలుసుకున్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఓ ఆనంద్

ప్రతి ఎకరాకు సాగునీరిస్తాం..

రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ నేటి ఎత్తిపోతల పనులను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజతో కలిసి పరిశీలించారు. ఆదివారం సాయంత్రం ప్రాజెక్టు వచ్చిన వీరు అక్కడ జరుగుతున్న పనుల గురించి తెలుసుకున్నారు. ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు పనులను పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఎస్ ఈ వరలక్ష్మి కాలువకి ఎన్ని క్యూసెక్కులు నీళ్లు వెళ్తున్న వివరాలు తెలిపారు.ఆయన మాట్లాడుతూ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎంత ఖర్చయినా పర్వాలేదు కాలువకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని చెప్పినట్లు వివరించారు. ఇరిగేషన్ సి.ఈ శ్యాం ప్రసాద్, ఎస్.ఈవరలక్ష్మి, డీ.ఈ లు వెంకటేశ్వర్లు, మధుసూదన్ రావు,ఎ.ఈ లు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, ఎంఎల్ఎ ఇంటూరి

వైసిపిలో చేరిన టిడిపి నాయకుడు

ప్రజాశక్తి-కందుకూరు

మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని కొనసాగాలని కాంక్షిస్తూ గుడ్లూరు మండలం పరకొండపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు చిరుతోటి ఏడుకొండలు వైసిపిలో చేరారు. ఆదివారం కందుకూరులో గుడ్లూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు పులి రమేష్ ఏడుకొండలకు వైసిపి కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఏడుకొండలు మాట్లాడుతూ బుర్రా మధుసూదన్ యాదవ్ నాయకత్వాన్ని బలపరుస్తూ పార్టీలో చేరుతున్నామన్నారు. సర్పంచ్ కోల కొండయ్య,మాజీ సర్పంచ్ అల్లం బసవయ్య ,చెరుకూరి బ్రహ్మయ్య ఉన్నారు.

వైద్య సేవలకు ప్రాధాన్యం

ప్రజాశక్తి-నెల్లూరు

కూటమి ప్రభుత్వ పాలనలోనే వైద్యానికి అధిక ప్రాధాన్యత లభిస్తుందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ఆదివారం కోటమిట్ట ప్రాంతంలోని షాదీ మంజిల్‌లో రెయిన్ భో వైద్యశాల యాజమాన్యం సౌజన్యంతో రాష్ట్ర ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శి జాకీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరం కార్యక్రమానికి చైర్మన్లు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్‌లు ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ లు మాట్లాడుతూ మెడికల్ క్యాంపు లలో బోన్ డెన్సిటీ టెస్ట్ పెట్టడం ఇదే ప్రప్రథమం అన్నారు. నగర, రూరల్ డివిజన్లలో ఉచిత వైద్యశిభిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిడిపి శ్రేణులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. వివిధ వైద్యుల ద్వారా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో దాదాపు 500 మంది వైద్యసేవలను పొందారన్నారు. పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మైనుద్దీన్, కువ్వారప బాలాజీ,ఉస్మాన్, రబ్బాని, నౌషాద్, ఇంతియాజ్, జాఫర్, అజీజ్ మౌలానా, అష్రాఫ్, శ్రీదేవి, గౌనుస్నిస, జమీర్, రేష్మ, హఫీజ్, షిరిన్, సుష్మా సింగ్, దస్తగిరి,స్థానిక టిడిపి నేతలతో పాటు రెయిన్బో హాస్పిటల్ డాక్టర్లు పాల్గొన్నారు.

అమిత్ షాను తొలగించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి -గుడ్లూరు

అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్‌చేస్తూ గుడ్లూరు లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర కెవిపిఎస్ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. దేశవ్యాప్తంగా అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన వ్యక్తమవుతున్నా కూటమి నాయకులు గానీ, వైసిపి నాయకులు గానీ ఖండించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నేలటూరి తిరుపాలు పాలకుర్తి నాగేశ్వరరావు సైదులు సిపిఎం కార్యదర్శి జి మల్లికార్జున ఇరువురు బ్రహ్మయ్య రైతు సంఘం నాయకులు డ్రామా కష్ణయ్య వర్జినేని సిద్దయ్య సిపిఎం సీనియర్ నాయకులు మద్దిచెట్టి జాలయ్య కొమరగిరి అంజయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సన్యాసి పిచ్చయ్య బాలకోటయ్య కొమరగిరి నాగేశ్వరరావు సిఐటియు ఆఫీస్ బేరర్ గంటినపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుడ్లూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-కందుకూరు

అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని విశాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఆదివారం కందుకూరులో పూలే విగ్రహం వద్ద నుంచి బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ జరిగింది. ర్యాలీ అనంతరం ఐక్యవేదిక నాయకులు మాట్లాడారు. ఎఎడి అసోసియేషన్ నుంచి చిరంజీవి రామారావు, బి టి ఏ ఉపాధ్యాయ సంఘం నాయకులు కల్లగుంట మోహన్ రావు షేక్ అబ్దుల్లా , మాల మహానాడు ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీరాములు కట్ట రమేష్, సిపిఎం నాయకులు జి వెంకటేశ్వర్లు ఎస్.ఎ గౌస్, సిపిఐ నాయకులు సురేష్ బాబు మాలకొండయ్య, ఆప్ నేత నేతి మహేశ్వర రావు, కాంగ్రెస్ నాయకుల చిందరబోయిన నరేష్, విసికె పార్టీ నేత ఆదినారాయణ, అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వి జయలక్ష్మి

హక్కుల కోసం పోరాటం

ప్రజాశక్తి-కందుకూరు : దేశంలో మహిళల రక్షణకు, వారి హక్కులను కాపాడటంలో ముఖ్య పాత్ర పోషించి పోరాటాలు చేసేది ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య మాత్రమేనని ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు వి. జయలక్ష్మి పేర్కొన్నారు. కందుకూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయం ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కందుకూరు మండల జనరల్ బాడీ సమావేశం కారంశెట్టి ఇంద్రజ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు వి జయలక్ష్మి పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జెండాను ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి సుదర్శి రావమ్మ ఆవిష్కరించారు. అనంతరం ఏఐకేఎస్ రావుల వెంకయ్య మాట్లాడారు. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం సనాతన ధర్మాన్ని తీసుకొని రావాలని ప్రయత్నాలు చేస్తుందని దానిని అరికట్టాలన్నారు.ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు వి జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన వాటిని అమలుపరచడంలో ప్రభుత్వాలు విఫలమవు తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి సుదర్శి రావమ్మ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రకాశం జిల్లా కార్యదర్శి రావులకొల్లు లక్ష్మి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి యర్రంశెట్టి ఆనందమోహన్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కందుకూరు నాయకులు శైలజ, కల్పన ఉన్నారు.

రేషన్ కార్డుల కోసం అవస్థలు

ప్రజాశక్తి -గుడ్లూరు

రేషన్ కార్డుల కోసం జనం అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఈనెల 28 వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించింది. అయితే వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో ప్రజలు సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నారు.ప్రభుత్వం విధించిన గడువు సమీపిస్తుండటంతో ఇప్పటికైనా సంబంధి అధికారులు స్పందించి వెబ్‌సైట్ ఓపెన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నేడు విద్యుత్ భారాలపై నిరసన : సిపిఎం

ప్రజాశక్తి -వెంకటాచలం

విద్యుత్ వినియోగదారులపై అధిక భారాలు మోపడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నేడు సచివాలయాల ఎదుట నిరసన తెలపునున్నారు. ఈ మేరకు ఆదివారం సిపిఎం కమిటీ సమావేశంలో నాయకులు వెల్లడిం చారు.ఈ సమా వేశంలో సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు గోగుల శ్రీనివాసులు,సిపిఎం సీనియర్ నాయకులు కటికాల వెంకటేశ్వర్లు, మండల ఆర్గనైజర్ సెక్రెటరీ తలారి దేవదానం, మండల కమిటీ సభ్యులు తుమ్మతాటి వెంకయ్య షేక్ నజీర్ ఉన్నారు.

'తూర్పు పూండ్ల'లో దాహం కేకలు..!

వేసవికి ముందే తాగునీటి అవస్థలు - 15 రోజులుగా మరమ్మతులకు నోచని మోటర్లు

ప్రజాశక్తి -సైదాపురం

మండలంలోని రామసాగరం పంచాయతీ తూర్పు పూండ్ల గ్రామంలో తాగునీటి అవస్థలు నెలకొన్నాయి. బిందెడు నీటి కోసం మహిళలు, ప్రజలు పడిగాపులుగాస్తున్నారు. దీంతో గ్రామస్తులు ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేసి తమ గ్రామానికి తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ మీడియా ముఖంగా తెలిపారు.పూండ్ల గ్రామంలో తాగునీటి కోసం ఎక్కడో దూరాన ఉన్న పంట పొలాల బాటపడుతున్నారు. దాహర్తీ తీర్చండి సారో.. అని విన్నవించు కుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూర్పు పూండ్ల గ్రామంలోని 1200 నివాస గహాలు, 2,700.మంది జనాభా ఉన్నారు. గత పదిహేను రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి తాగునీరందించేందుకు పుష్కలంగా నీటిబోర్లు, వాటర్ ట్యాంకులు ఉన్నప్పటికీ పదిహేను రోజులనుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలోనే పరిస్థితి ఇలా ఉంటే మండు వేసవిలో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి విమలను ప్రజాశక్తి వివరణ కోరగా గత మూడు రోజుల నుంచి సెలవులో ఉన్నానని, నీరు రాక ఇబ్బందులు పడడం వాస్తవమేనని, తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడతామన్నారు. పూర్తి స్థాయిలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మోటార్లకు మరమ్మతులు చేయాలి..

ఎఈ మనోజ్, ఆర్‌డబ్ల్యుఎస్

పైపులైన్లు, మోటార్లు మరమ్మత్తులకు గురైన కారణంగా నీటి సమస్య తలెత్తింది. త్వరలో సమస్యకు పరిష్కారం చూస్తాం.. ఒకటి రెండు రోజుల్లో నీరు సరఫరా అవుతుంది..

15 రోజులుగా అవస్థలు పడుతున్నాం..

వసంత లక్ష్మి, మాజీ ఎంపిటిసి

మాజీ ఎంపిటిసి వసంత లక్ష్మి. మాట్లాడుతూ గత 15 రోజుల నుంచి బిందెడు నీళ్ల కోసం నానా తంటాలు పడుతున్నాం. దూరంగా ఉన్న పంట పొలాల్లోకి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. నీళ్లు ఏప్పుడొస్తాయో తెలియక రాత్రిం బవళ్లు నీళ్ల కోసం పడిగాపులు గాస్తున్నాం. సంబంధిత అధికారులకు తెలిపినా సమస్యను పట్టిం చుకోవడం లేదు.

అధికారులు స్పందించడం లేదు..

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గ్రామంలో తాగునీటితో పాటు పారిశుధ్య పనులు, వీధిలైట్ల గురించి పట్టించుకోవటం లేదు. తాగునీటి సమస్య పరిష్కరించాలని పలు మార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదు. ప్రజల మౌలిక సమస్య అయిన తాగునీటి సరఫరాపై రాజకీయం చేయడం సరికాదన్నారు.

సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ సర్పంచ్

'ఎలికేరు' వద్ద ప్రయాణికుల ఇక్కట్లు

అదుపుతప్పుతున్న వాహనాలు -గాయాలపాలవుతున్న వైనం

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

మండలంలోని చిమిడిదిపాడు - ఎలికేరు నేల చప్టా వద్ద తరచూ పాదచారులు ప్రమాదాల భారినపడుతున్నారు. వాగు నిరంతరం పారుతుండటం వల్ల బ్రిడ్జిపై సుమారుగా రెండు నుంచి3 అంగుళాలు పాచిపట్టి ఎలికేరు దాటే సందర్భంలో కాలుజారి ఇటీవల సుమారుగా 10 మంది గాయపడ్డారు. వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాచికారణంగా వాహనాలు స్కిడ్ అవుతున్నాయి. దీంతో వాహనచోదకులు జారిపడుతున్నారు. చిమిడిదిపాడు పాడు గ్రామస్తులు నిరంతరం నిత్యా వసరాలు తెచ్చుకోవడానికి, రైతులు ఎరువుల పురుగుల మందులు కోసం గుడ్లూరు గానీ, కావలి గానీ కావలి వెళ్తుంటారు. దీంతో ఆ మార్గం గుండా వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

శాశ్వత పరిష్కారం చూపాలి

రైతు సంఘం

ఇక్కడి ఇబ్బందులను గతంలో అధికారుల దష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని రైతు సంఘం నాయకులు దామా కిష్టయ్య బ్రహ్మయ్య పేర్కొన్నారు.తక్షణమే ప్రభుత్వం అక్కడ శాశ్వత పరిష్కారం చూసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని వారు కోరారు.



రైతు సంఘం నాయకులు

మాట్లాడుతున్నకంచర్ల రామయ్య

ఎన్‌సిసి విద్యార్థులకు వీడ్కోలు

ప్రజాశక్తి-కందుకూరు

ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ నేషనల్ కెడేట్స్ ట్రూఫ్ 34(ఏ) బెటాలియన్ పరిధిలో ఉత్తమ సాధనలో బెస్ట్ టీమ్ గా ఖ్యాతిగాంచిందని సుబేదారు ఇంద్రజిత్ ప్రశంసించారు. ఫైనల్ ఇయర్ విద్యార్థుల ఎన్‌సిసి ట్రూప్‌నకు జూనియర్ ట్రూఫ్‌లు ఆదివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబేదారు ఇంద్రజిత్ ప్రకాశం ఎన్‌సిసి విద్యార్థులను ప్రశంసించారు. కాలేజీ ఎన్‌సిసి ఇన్‌ఛార్జితోపాటు యాజమాన్యం విద్యార్థులకు, తమకు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.రవికుమార్, టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కే. విజయ్ శ్రీనివాస్, హవాల్దార్ సుధీర్, తమ రాజు, నారాయణ లు ప్రసంగించారు. కాలేజీ ఎన్‌సిసి ఇన్ చార్జి ఎస్.ఎన్ మీరావలి పర్యవేక్షించారు.

పివి రావుకు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు

మాల మహానాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పివి రావు 19వ వర్ధంతి కార్యక్రమం కందుకూరు నియోజకవర్గ మాల మహానాడు, మాల ఉద్యోగుల సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా రమేష్, ఉమ్మడి ప్రకాశం జిల్లా మాల ఉద్యోగుల సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్ము థామస్‌ల ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది.సభకు కట్టా. రమేష్ అధ్యక్షత వహించారు. తొలుత భారతరత్న అంబేద్కర్‌కి పూల మాలలతో నివాళులర్పించి. పివి రావు చిత్ర పటానికి పూల మాలలతో నివాళు లర్పిపించారు. జెఎసి నాయకులు పాలేటి కోటేశ్వరరావు,ఎఎడి అసోసియేషన్ గౌరవధ్యక్షులు గేరా చిరంజీవి,ఎఎడి అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గేరా కళ్యాణ్,దాసరి వీర నారాయణ, దాసరి ఆదినారాయణ ఉన్నారు.

స్మార్ట్ మీటర్లు ఉచితం..

ప్రజాశక్తి-నెల్లూరు

కొత్త విద్యుత్ సర్వీసులకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేరిటీ కమిషన్ వారు నిర్దేశించిన రేట్లు మాత్రమే వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుందని, స్మార్ట్ మీటర్లను డిపార్ట్మెంట్ వారే ఫ్రీగా బిగిస్తారని విద్యుత్తు శాఖ ఎస్ఈ వి.విజయన్ పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో కొత్త సర్వీసులకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేరిటి కమిషన్ వారు నిర్దేశించిన రేట్లు ప్రకారమే వినియోగదారులు చెల్లించాలని అలా కాకుండా సంస్థ ఉద్యోగులు ఎవరైనా ఎక్కువ చెల్లించాలని అడిగినచో వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. 4 కిలో వాట్స్ వరకు సింగల్ ఫేస్, 5 కిలోవాట్ దాటిన వారికి త్రీఫేస్ సర్వీస్‌లో విద్యుత్తు సరఫరా చేస్తామన్నారు. గహాలకు డెవలప్మెంట్ చార్జెస్ క్రింద మొదటి కిలోవాటుకు 1500 ఆ తర్వాత ప్రతి కిలోవాటుకు రూ. 2 వేలు, సెక్యూరిటీ డిపాజిట్ కిలోవాటుకు రూ. 200లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కమర్షియల్స్ వారు డెవలప్మెంట్ చార్జెస్ రూ.2 వేలు, సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ. 8 వందలు కిలో వాటుకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. త్రీఫేస్ సర్వీసు మినిమం 5 కిలో వాట్స్ దాటిన వారికి మాత్రమే ఇస్తామన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు సిపిఎం పట్టణ కమిటీ సమావేశం ఆదివారం సిపిఎం కార్యాలయంలో జరిగింది ఈ సమావేశానికి ఎం మల్లికార్జున్ అధ్యక్షత వహించారు సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఎ గౌస్ మాట్లాడారు. సిపిఎం పార్టీ రాష్ట్ర 27వ మహాసభలు 2025 ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరుగుతున్నాయన్నారు. మహాసభలకు ప్రజలందరూ తోడ్పాటునందించి జయప్రదం చేయాలని కోరారు. పట్టణ కమిటీ నాయకులు ఎన్ కోటేశ్వరరావు పట్టణంలో మౌలిక వసతుల కల్పించాలని, దోమలు నివారించాలని ప్రతిపాదించిన తీర్మానానికి సమావేశం అమోదం తెలిపింది. ఎస్‌కె మున్వర్ సుల్తానా ,ఎం పద్మ ,టి వెంకట్రావు, ఎస్ పవన్ కుమార్,ఎస్‌కె మల్లీకా పాల్గొన్నారు.

కాకర్ల సంహిత్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఉదయగిరి : సీతారామపురం మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన ఘటిక సిద్ధేశ్వరంలో వెలసిన పరమ శివుని సన్నిధానంలో ఎంఎల్ఎ కాకర్ల సురేష్ తనయుడు కాకర్ల సంహిత్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ కాకర్ల సురేష్ కుటుంబ సభ్యులు ఘటిక సిద్ధేశ్వరం చేరుకోగా సీతారామపురం మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణాహుతితో స్వాగతం పలికి పరమశివునికి కాకర్ల సంహిత్ చేతుల మీదుగా అభిషేకం చేయించారు. అనంతరం అన్నపూర్ణాదేవికి కుంకుమ పూజ చేశారు. ఆ తర్వాత కాకర్ల సంహిత్ కేకును కట్ చేయగా నాయకులు భక్తులు శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో ఎంఎల్ఎ కాకర్ల సురేష్ కుటుంబ సభ్యులు కాకర్ల వెంకట సుబ్బానాయుడు, మస్తానమ్మ, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, మండల టిడిపి కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మాజీ జెడ్‌పిటిసి కలివెల జ్యోతి, హరినాథ్, పాశం నరసింహనాయుడు, మధు రెడ్డి, మనో ప్రకాష్, వెంగప నాయుడు, జనసేన నియోజకవర్గ నాయకులు భోగినేని కాశీరావు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : సాంబశివా ఛారిటబుల్ ట్రస్టు అధినేత కంచి పరమేశ్వరరెడ్డి తన దాతృత్వ సేవలను కొనసాగిస్తున్నారు. ఆదివారం కుటుంబ సభ్యులను కోల్పోయిన 8 కుటుంబాల వారికి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున మొత్తం రూ.80వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. 1వ వార్డుకు చెందిన ఏసుపోగు పెంచలయ్య, 4వ వార్డుకు చెందిన పోతల రాగయ్య, 7వ వార్డుకు చెందిన షేక్ కరిముల్లా, 9వ వార్డుకు చెందిన కామిశెట్టి రామచంద్రరావు, 11వ వార్డుకు చెందిన తంగేళ్లపల్లి లక్ష్మమ్మ, 13వ వార్డుకు చెందిన శాగలముడి పెంచలయ్య, 15వ వార్డుకు చెందిన కొమరగిరి నారమ్మ, 23వ వార్డుకు చెందిన పఠాన్ బాబులు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను ఆదివారం ట్రస్టు సభ్యులు కెవి శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్ రెడ్డి, అచ్చోలు నరసింహారెడ్డి తదితరులు పరామర్శించి వారికి ఆర్థికసాయం అందజేశారు. కంచి పరమేశ్వరరెడ్డి చేసిన సాయాన్ని తాము జీవితాంతం గుర్తుంచుకుంటామని బాధిత కుటుంబసభ్యులు తెలిపారు.

బైక్‌ను ఢీ కొన్న ట్రాక్టర్

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లిలోని సోమశిల ఉత్తరకాలువ వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై వెళ్తున్న మోటార్ బైక్‌ను ట్రాక్టర్ ఢీ కొన్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్సనిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి-దగదర్తి : మండల పరిధిలోని తురిమెళ్ళ అటవీ ప్రాంతంలో ఎస్ఐ జంపాని కుమార్, సిబ్బందితో కోడిపందేల స్థావరంపై దాడులు నిర్వహించారు. కోడిపందేలు నిర్వహిస్తున్న వారిలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లను, రూ.1410లను, మూడు మోటార్ సైకిళ్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా కోడిపందేలు, పేకాట, గంజాయి వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండల పరిధిలోని బట్టేపాడు పొలాల్లో కోడి పందేల నిర్వహిస్తున్న స్థావరాలపై ఆత్మకూరు పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఐదుగురు నిందితులు, 8 కోళ్లను, 19 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ గంగాధర్ మాట్లాడుతూ కోడి పందేలు చట్ట వ్యతిరేకమని, ఎవరూ అలాంటి వాటిని ప్రోత్సహించవద్దని సూచించారు. ఆయనవెంట ఎస్ఐలు జిలానీ, సాయిప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి : కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. టిడిపి నాయకులు, కావలి ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ చదల రామకృష్ణ – లక్ష్మీ వల్లి దంపతుల మనవడు నామకరణ, బారసాల వేడుక కార్యక్రమం కావలి పట్టణం శివాలయం వీధిలోని వి హెరిటేజ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం కావలి పట్టణానికి చెందిన పచ్చిపులుసు వెంకటేష్ (వెంకట్) – పార్వతి దంపతుల కుమార్తె నిధి పుష్పాలంకరణ కార్యక్రమం కావలి పట్టణంలోని బృందావనం హౌసింగ్ కాలనీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

'మంచిమాట' కార్యక్రమం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : తెలుగుభారతి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతినెల నిర్వహించే మంచిమాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ ఎస్.రామ్మోహన్ రెడ్డి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గురించి వివరించారు. భారతీయ సంస్కృతిలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ సాంప్రదాయాలకు ప్రతిబింబమని, ఇది అనేక తరాల వ్యక్తులు ఒకే చోట జీవించే విధానానికి నిదర్శనమన్నారు. ప్రేమ, అనుబంధం ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో ఒకరినొకరు ఆదరించుకుంటారని, ఆర్థికంగా ఆదాయాన్ని అందరూ కలిసి పంచుకుంటారన్నారు. కుటుంబ సభ్యుల ప్రతిఒక్కరూ బాధ్యత కలిగి అందరి సంరక్షణ చేసుకుంటారన్నారు. పెద్దవారి అనుభవాలు, సలహాలు తరాల వారసత్వం మిగిలి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుందన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ వల్ల కుటుంబ సభ్యుల మధ్యతో ఒంటరితనం, మానసిక ఒత్తిడి లాంటి సమస్యలు తగ్గుతాయని తెలిపారు. ఉమ్మడి కుటుంబాలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు భారతి సేవాసమితి అధ్యక్షుడు సోమసుందర సుబ్బారాయుడు, గౌరవాధ్యక్షులు అంకినపల్లి గోవిందరెడ్డి, సహ ప్రధాన కార్యదర్శి జి.రామిరెడ్డి, ఎఐ శ్రీనివాసరావు, సహాధ్యక్ష కార్యదర్శి కొల్లా వెంకటేశ్వర్లు, గౌరవసలహాదారులు ఎస్ వి రమణయ్య, కోశాధికారి బి. శేషారెడ్డి, వి నారాయణ, ఉమ్మడి కుటుంబ సభ్యులు సుబ్రమణ్యం, సేవాసమితి ప్రతినిధులు రామయ్య స్వామి, నరసింహారెడ్డి, కలిశెట్టి రవీంద్రకుమార్, ఉంకారం శ్రీనివాసులు, గొర్రెముచ్చు రాజు, చేడే అమరావతి, సురేష్‌బాబు, పెంచలరెడ్డి, వెంకయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, తదితరులున్నారు.

24న కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి కొవ్వూరు: 50వ అంతర్ జిల్లాల జూనియర్స్ బాల బాలికల కబడ్డీ పోటీలు వచ్చే జనవరి 3వతేది నుంచి 5వ తేది వరకు కర్నూలులోని జరుగుతాయని ఈ పోటీలలో పాల్గొనే ఉమ్మడి నెల్లూరు జిల్లా బాలబాలికల కబడ్డీ జట్టును 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని పడుగుపాడు గ్రామ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఎంపికలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి, ఉపాధ్యక్షులు పూండ్ల డేవిడ్ జాన్సన్ తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ హోం వద్ద ఆదివారం జరిగిన పాత్రికేయ సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా జట్టు ఎంపికలకు పాల్గొనే వారు 12-01-2005 తరువాత జన్మించిన వారై, 19వేళ్ల వయస్సు లోపు వారు పాల్గొనుటకు అర్హులని తెలిపారు. బాలురు 70 కిలోలు బాలికల 65 కిలోల బరువు కలిగి ఉండాలని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర కబడ్డీ జట్టును ఎంపిక చేసి జనవరి 2025 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు హర్యానాలో జరిగే జాతీయస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో ఎంపికలకు హాజరు కావాలని తెలియజేశారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బైనా లక్ష్మీకాంతం, ఇంత శ్రీధర్ రెడ్డి, ఐసి మెంబర్ ఎ.సింహాద్రి, జి.శ్రీనివాసులు, క.కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

గంధ మహోత్సవం



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని అనుముసముద్రం గ్రామంలో ఖ్వాజా అమ్మవార్ 37వ గంధమహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ గంధ మహోత్సవ దర్గా సజ్జద మహమ్మద్ సర్వర్ చిష్తి ఆధ్వర్యంలో గంధాన్ని ఊరేగింపుగా, బాణాసంచా కాల్పులతో, పకీరుల జరుబులతో దర్గాకు తీసుకొని వెళ్లారు. ప్రార్థనలు చేసి గంధాన్ని అమ్మవారికి సమర్పించి తదనంతరం భక్తులకు పంచిపెట్టారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సౌరవిద్యుత్ వినియోగానికి ప్రోత్సాహం

- ఎస్ఇ వి.విజయన్

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం విజన్ -2047 నిర్ధేశాలకు అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ రాష్ట్రంగా గుర్తింపు పొందేందుకు వడివడిగా అడుగులు వేస్తుందని విద్యుత్‌శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్ అన్నారు. ఆ క్రమంలో సోలార్ పరికరాలు వాడకం పెంచుకోవాలని, సోలార్‌తో పనిచేసే పరికరాల వల్ల విద్యుత్ ఆదా అవడంతో పాటు మనమే విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. సౌర విద్యుత్‌తో ఆర్థికభారం తగ్గడమే కాక మిగులు విద్యుత్ ద్వారా మరింత ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందంటూ వినియోగదారులకు భరోసా ఇస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో సౌర విద్యుత్ ఉత్పాదనకు సౌరపలకలు ఏర్పాటు చేసుకొనేందుకు దరఖాస్తు ఏ విధంగా చేసుకోవాలి.. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లభిస్తుందో ఆయన మాటల్లో...

ప్రశ్న. సౌరవిద్యుత్ ఉత్పాదన చేసుకొనేందుకు ఆసక్తి ఉన్న వినియోగ దారులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పిఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన ఫథకంలో లబ్ధి పొందేందుకు ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటి వరకు ఎంత మంది దరఖాస్తులు చేసుకున్నారు..?

జవాబు. ప్రభుత్వ సబ్సిడీతో గృహాలకు ఇంటి పైకప్పుపై సోలార్ రూఫ్ ఆఫ్ నెలకొల్పడానికి పిఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. పిఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకంను వినియోగదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు సంబంధిత అధికారులు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు, www. pmsuryaghar. gov. inలో రిజిస్టర్ చేసుకొని ప్రభుత్వ రాయతీ ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో దాదాపు 5500 మంది వినియోగదారులు తమ పేర్లను రిజిస్ట్రేషన్స్ చేసుకున్నారు. ఎస్‌సి ఎస్‌టి వినియోగదారులు ఈ పథకాన్ని విరివిగా వినియోగించుకోవాలి. వినియోగదారుల ఆధార్, ఫోన్ నెంబర్, కరెంట్ బిల్లులతో సోలార్ పలకల రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సబ్ స్టేషన్‌లోని ఫీడర్ల పరిధిలో సర్వే నిర్వహించాలని ప్రభుత్వ ఖాళీస్థలం ఎంత వుందో నివేదిక సమర్పించాలని అక్కడ ఒక మెగావాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సోలార్ యూనిట్ ఏర్పాటు చేస్తే వ్యవసాయం ఫీడర్లకు కూడా ఉచిత విద్యుత్‌ను అందించడం సాధ్యమవుతుంది. వివిధ శాఖల ఉద్యోగులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలి. ప్రభుత్వ కార్యాలయాలు భవనాలపై సోలార్ రూఫ్‌టాప్ చేసుకోనే అవకాశం ఉంది.

ప్రశ్న. సోలార్ పలకలు ఏర్పాటు చేసుకొనేందుకు ఇంటిపైన ఎంత మేరకు ఖాళీ స్థలం అవసరం అవుతుంది. ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎన్ని యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ప్రభుత్వం నుంచి ఎంత మేరకు రాయితీ వస్తుంది.?

జవాబు. ఈ పథకం వల్ల గృహ వినియోగదాలకు గతంలో కంటే అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుంది. ఇంటి పైకప్పు కనీసం 10 చదరపు మీటర్లు లేదా వంద చదరపు అడుగులు కలిగిన స్థలంలో ఒక కిలోవాటు సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక కిలోవాట్ కు సంబంధించి సోలార్ ఏర్పాటుకు రూ.80వేలు ఖర్చు అవుతుండగా ప్రభు త్వం నుంచి రూ.30వేల రాయితీ, 2 కిలోవాట్స్‌కు రూ.1.40 లక్షల అవుతుండగా రూ.60వేల రాయితీ, మూడు కిలో వాట్స్‌కు రూ.1.90 లక్షల కాగా గరిష్టంగా రూ.78వేలు రాయితీ లభిస్తుంది. ఒక లబ్ధిదారుడు గరిష్ఠంగా మూడు కిలోవాట్స్ సామర్థ్యం సోలార్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక కిలో వాట్ సోలార్‌కు 120 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుతం మన బిల్లు రూ.1,000 వస్తే సోలార్ ఏర్పాటుతో వచ్చే బిల్లు రూ.338 బిల్లు వస్తుంది. అంటే ఏడాదికి రూ.8వేల వరకు ఆదాయం వస్తుంది. అలాగే రెండు కిలోవాట్లకు 240 యూనిట్లు ఉత్పత్తి అయితే సరాసరి రూ.2 వేల బిల్లు వచ్చే వారికి సోలార్ ఏర్పాటుతో రూ.333 వస్తుందని ఏడాదికి రూ.20వేలు ఆదాయం వస్తుంది. మూడు కిలోవాట్లకు సోలార్ సామర్థ్యం ఉన్నవారికి 360 యూనిట్లు ఉత్పత్తి అవుతుందని ప్రస్తుతం రూ.3వేలు బిల్లు వస్తే సోలార్ ఏర్పాటుతో రూ.253 బిల్లు వస్తుందని ఏడాదికి రూ.32,400 ఆదాయం చేకూరుతుంది.

ప్రశ్న. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకం కింద ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో సౌరవిద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కాలనీవాసులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేస్తున్నారా..?

జవాబు. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకం కింద ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిం చేందుకు కాలనీ వాసులకు అవగా హన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి అందుకు తగిన విధంగా ఆదేశాలు జారీ చేశాం. ఎస్‌సి, ఎస్‌టి కాలనీలలో 200 యూనిట్లు వినియో గిస్తున్న గృహాలను గుర్తించి వారితో మాట్లాడి సౌర విద్యుత్ ఉపయోగాలను తెలియజేస్తున్నాం. కాలనీలలోని ఇళ్లపై సౌర పలకల ఏర్పాటుకు అణువుగా లేనిచోట కాలనీ సమీపంలోని ఖాళీ స్థలాలను గుర్తించి రెవెన్యూ అధికారులతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటాం. జిల్లాలో దాదాపు 1,25,000 మంది ఎస్‌సి, ఎస్‌టి వినియోగదారులు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్నారు. వారందరికీ సూర్యఘర్ కింద ఉచిత విద్యుత్ అందించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. అందులో భాగంగా ప్రతి సర్వీసును తనిఖీ చేసి వినియోగదారునికి సూర్యఘర్ పథకం గురిస్తున్నాం.

ప్రశ్న. సోలార్ రూఫ్‌ఆఫ్ ఏర్పాటు చేసుకున్న వినియోగదారులకు భవిష్యత్తులో సమస్యలేమైనా తలెత్తితే పరిష్కరించేందుకు అనువుగా సిబ్బంది శిక్షణ ఏమైనా తీసున్నారా..?

జవాబు. విద్యుత్ భవన్‌లోని నిరంతర అధ్యయన కేంద్రంలో నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఆపరేషన్ సిబ్బందికి ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన విద్యుత్ పథకం గురించి, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుపై శిక్షణ ఇస్తున్నాం. సోలార్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా స్వయంగా విద్యుత్ తయారు చేసుకునే సౌలభ్యం ఏర్పడుతుంది. ప్రభుత్వం నుంచి సబ్సిడీ పొందవచ్చు. పొల్యూషన్‌ను నివారించవచ్చు. ఎలక్ట్రిసిటీ లాస్ తగ్గించడమే కాకుండా ఉత్పాదకత పెంచడానికి సోలార్ దోహదపడుతుంది. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దానికి తగ్గట్టు బిల్లులు వస్తుండడంతో సామాన్యులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. తమకు వచ్చే తక్కువ సంపాదనలోనే విద్యుత్తు బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ బిల్లుల నుంచి కొంత ఊరట కలిగించ డానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్తి బిజిలి యోజన తీసుకువచ్చిందని దానికింద రాయితీతో గృహ వినియోగదారులు ఇంటిపైన సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చు.

ముఖాముఖి

ట్రాఫిక్ స్తంభించిన దృశ్యం

మొక్కుబడిగా సర్వే

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఇటీవల నిర్వహించిన సర్వే మొక్కుబడిగా నిర్వహించారని దానిని సమర్థవంతంగా నిర్వహించాలని గ్రామస్తులు, సిపిఎం నాయకులు పత్రికా ముఖంగా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బస్టాండ్ సెంటర్లో నీళ్లు నిలబడి ఉన్న కారణంగా ఆర్అండ్‌బి అధికారులు మార్కింగ్ ఇచ్చి, సర్వేను అరకొరగా నిర్వహించి, అక్కడ ఇంతవరకు సైడ్ కాలువలు నిర్మించకుండా ఎక్కడ గుట్టలు అక్కడే వదిలేసి వెళ్లిపోయారని తెలియజేశారు. ఎఎస్‌పేట గ్రామం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలసి ఉంది కాబట్టి ఇక్కడకు హైదరాబాదు ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువగా రాకపోకలు జరుగుతూ ఉంటాయని, కావున ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, నాయకులు గమనించి రోడ్డు వెడల్పు పనులు సత్వరమే చేపట్టి సైడ్ కాలువలు నిర్మించాలన్నారు. ఎఎస్‌పేట గ్రామస్తులు, సిపిఎం మండల కార్యదర్శి మొగల్ నిస్సార్ అహ్మద్ ఎద్దేవా చేశారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : అనుమసముద్రం గ్రామంలో గొర్రెపిల్ల తెలుగు బాప్టిస్ట్ ప్రార్థనా మందిరంలో పాస్టర్ విజిత్‌రాజు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ సందర్భంగా కొవ్వొత్తులతో ఎఎస్‌పేట అనుముసముద్రం గ్రామంలోని ఆ సంఘం గృహాల మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సురేష్ బాబు, ప్రసన్న, రాహేలమ్మ, వెంకట్ రమణమ్మ, లక్ష్మీ, పిల్లలు అభిషేక్, ప్రవల్లిక, హరిప్రియ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

గణపతిరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గణపతిరావు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-జలదంకి

సమాజాభివృద్ధిలో కమ్యూనిస్టు నేత చిమటా గణపతిరావు సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. మండలంలోని జమ్మలపాలెం గ్రామంలో ఆయన సంతాపసభను ఆదివారం అడపాల సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత కెవిపిఎస్ నాయకులు కె.జాన్ గణపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి పాల్గొన్న వారందరూ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ చిమటా గణపతిరావు జమ్మలపాళెం గ్రామ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. పెత్తందారి వ్యతిరేక పోరాటంలో భూముల కోసం, ఇళ్ల స్థలాల కోసం, పౌర హక్కుల కోసం జరిగిన పోరాటాలలో ముందుండి నడిపారని కొనియాడారు. రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు రావి మాల్యాద్రి మాట్లాడుతూ చిమటా గణపతి రావు జమ్మల పాలెం గ్రామానికి అనేక హక్కులు సాధించడంలో ముందుండారని తెలిపారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాధాకృష్ణయ్య, వ్యకాసం మండల కమిటీ సభ్యులు బత్తల నరసింహ, గ్రామస్తులు కావలి చిన్న, కావలి శీనయ్య, టి.మాలకొండయ్య, జైపాల్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

'సంయుక్త' ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం తుపాన్ నగర్లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో ఆయన గురించి పోటీ నిర్వహించి బహుమతి అందజేశారు. రెండవ కార్యక్రమం

అన్నదానం చేస్తున్న దృశ్యం

కావలి పట్టణం ఇందిరానగర్ నివాసులు నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు, సంయుక్త సేవాసంస్థ సభ్యులైన గంధం ప్రసన్నాంజనేయులు వారి తమ్ముడు కావలి మొదటి నేత్ర దాత గంధం వీరాంజనేయులు జన్మదినం సందర్భంగా పట్టణంలోని సంయుక్త సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అన్నదానం చేశారు. అనంతరం మరోదాత కచ్చేరిమిట్ట నివాసులు శాంతివర్ధన్ క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని వారి తాతయ్య, నానమ్మ శామ్యూల్ – క్రిష్టియాన పేర్లపై పెంకుల ఫ్యాక్టరీ చెరువుకట్ట గిరిజనులకు, శివరామ సుబ్బయ్య కాలనీలోని గిరిజనులకు, జంగాల కాలనీలోని పేదలకు దుప్పట్లు వితరణ చేశారు. కార్యక్రమాల్లో గంధం ప్రసన్నాంజనేయులు, విశ్రాంత లెక్చరర్ ఎం వి ఎన్ ప్రసాద రావు, మల్లేశ్వర రావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

ఈ-కెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని రాజవోలు పిఎసిఎస్‌లో ఖాతా కలిగిన రైతులు ఈ-కెవైసి చేయించుకోవాలని ఎంపిడిఒ ప్రసన్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా పత్రికా విలేకరులతో ఆమె మాట్లాడుతూ మండలంలో 1872మంది రైతుల ఖాతాలు పెండింగ్‌లో ఉన్నాయని, రైతులు వారి సచివాలయ సిబ్బంది దగ్గరకు వెళ్లి ఈ కెవైసీ చేయించుకోవాలని, అలా చేయించుకున్న ఎడల ప్రభుత్వం నుంచి సబ్సిడీలు, ఎరువులు, లోన్లు సులభతరంగా పొందవచ్చని తెలియజేశారు.

పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని పాటూరు పంచాయతీ ఉత్తర పల్లిపాలెంలో పారిశుధ్యం పడకేసింది. గత కొంత కాలంగా మురుగునీరు పోక కాలువ నీళ్ళు పొంగి ఇళ్లల్లోకి చేరుతున్నాయి. నీరు నిల్వ ఉండడంతో దోమలు పెరిగి ఊరంతా విష జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. మండల స్థాయి అధికారులకు చెప్పినా.. పట్టించుకున్న పాపానపోలేదు. పాటూరు పంచాయతీ వారు కొద్దిపాటి నిధులతో కాలువ నిర్మాణం చేపట్టినా.. అధికారులు ఆ పనులు ఆపాలని అడ్డుపడ్డారని చేయాల్సిన కాలువ పని కాస్త ఆగిపోయింది. గత వారం రోజులుగా విష

తమ ఆవేదనను వెళ్లబుచ్చుతున్న స్థానికులు

జ్వరాలతో ప్రజలు బాధపడుతూ వేలరూపాయలు ఆస్పత్రులకు ధారపోస్తూ తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు నీరు పోయేవిధంగా చర్యలు తీసుకోవాలని మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సత్యసాయి జిల్లా జట్టు విజయం

ప్రజాశక్తి-కోవూరు

53వ రాష్ట్రస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ మహిళల ఛాంపియన్‌షిప్ 2024-25ను సత్యసాయి జిల్లా జట్టు గెలుచుకుంది. కోవూరు మండలంలోని పాటూరు జెడ్‌పిహెచ్‌ఎస్‌లో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ మహిళల పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో రెండో స్థానంలో కడపజట్టు, మూడో స్థానం నెల్లూరు జట్టు, నాలుగోస్థానం ఈస్ట్ గోదావరి జట్లు గెలుచుకున్నాయి. ఈ పోటీలను ఎపి ప్రాంతీయ వ్యాయామ విద్యా పరిరక్షకులు మహబూబ్ బాషా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపి హ్యాండ్‌బాల్

ట్రోఫీ అందుకుంటున్న జట్టు

అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రామాంజనేయులు, హెచ్‌ఎం గణపర్తి వెంకటేశ్వర్లు నాయుడు, నిర్వాహకులు భీమతాటి వెంకటరమణయ్య, రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్, రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అనంతసాగరం

గణితం అన్ని శాస్త్రాలకు తల్లి వంటిదని, గణితశాస్త్రం లేకుండా ప్రపంచం ఏ రంగంలోనూ ముందంజ వేయలేదని దైనందిన సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతుందని అనంతసాగరం గ్రంథ భాండాగారి డి.నారాయణ రావు పేర్కొన్నారు. గ్రంథాలయంలో ఆదివారం 12వ జాతీయ గణిత దినోత్సవంలో భాగంగా సంఖ్యా శాస్త్రంలో విశేష కృషి చేసిన భారత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎక్కడ ఏ పరిశోధనకైనా గణితమే ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. గణితం లేకపోతే ప్రపంచం పురోగతి సాధించలేదని మండల కేంద్రమైన అనంతరం భారత ప్రభుత్వం 1962లో సంఖ్యా శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా తపాలా బిళ్ళను విడుదల చేసిందని తెలిపారు. ఆయన 125వ జయంతి సందర్భంగా 2012 సంవత్సరాన్ని జాతీయ

రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు

గణితశాస్త్ర గణిత శాస్త్ర దినోత్సవంగా ప్రకటించిందన్నారు. అప్పటి నుండి డిసెంబర్ 22వ తేదీని జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలియజేశారు. 2017లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాలోని కుప్పంలో రామానుజన్ మట్ పార్కు ప్రారంభించా రని తెలిపారు. దేశవ్యాప్తంగా పాఠశాలలో విశ్వవిద్యాలయాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా పలు అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులున్నారు.

ప్రీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్

ప్రీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ఉదయగిరి

సీతారామపురం మండలంలోని సోంపల్లి గ్రామంలో గ్రేస్ ఇవాంజెలికల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు కాకర్ల సురేష్ తనయుడు సంహిత్ హాజరై క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి నూతన వస్త్రాలను బహూకరించారు. అనంతరం ఎంఎల్ఎ తనయుడు కాకర్ల సంహిత్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. గ్రేస్ ఇవాంజెలికల్ మినిస్ట్రీస్ అధ్యక్షులు జాషువా, జనరల్ సెక్రటరీ ప్రభువు, టిడిపి మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మాజీ జెడ్‌పిటిసి కలివెల జ్యోతి, మాజీ కన్వీనర్లు వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, బూత్ కన్వీనర్ జమ్మలమడుగు ఇశ్రాయిల్, ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, సింగాలనాగేశ్వరరావు పాల్గొన్నారు.

బలిజల సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కావలి

నెల్లూరు ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం దగ్గర ఉన్న కాపు (బలిజ) భవన్‌లో 29వ తేదీ ఆదివారం "బలిజల ఆత్మగౌరవ సభ"ను నిర్వహిస్తున్నామని, ఈ సభకు బలిజ సోదరులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని జయప్రదం చేయాలని రాయలసీమ బలిజ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు వెలిశెట్టి శ్రీహరిరాయల్, కాపు నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో జనసేన జిల్లా కార్యదర్శి సమ్మను వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాపునాడు ఛైర్మన్ మిరియాల వెంకటరావు 85వ జయంతి, విజయవాడ శాసనసభ్యులు వంగవీటి మోహన్‌రంగారావు 36వ వర్థంతి సందర్భంగా నెల్లూరు కాపు భవన్‌లో బలిజల ఆత్మగౌరవ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రమాదేవి దంపతులు హాజరవుతారని తెలిపారు. తిరుపతి శాసనసభ్యులు అరణి శ్రీనివాసులు, టిటిడి పాలక మండల సభ్యులు జ్యోతుల నెహ్రూ, శాసన మండలి సభ్యులు సి.రామచంద్రయ్య, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ శాసన సభ్యులు వంగవీటి రాధాబాబు తోపాటు అనేకమంది మాజీ శాసనసభ్యులు,

మాట్లాడుతున్న నాయకులు

అతిథులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అతిథులు చేతుల మీదుగా బలిజ పేద, మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు, టాలెంట్ అవార్డులు, బలిజ బంధు పురష్కరాలు అందజేసి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన బలిజ కుటుంబ సభ్యులందరికీ మధ్యాహ్నం విందును కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమానికి బలిజ సోదరులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నువ్వుశెట్టి జనేష్, పాలడుగు వెంకటేశ్వరరావు, తోట ప్రభాకర్ రావు, పసుపులేటి శ్రీనివాసులు, కూనపురెడ్డి కేశవ రావు, తోకల వెంకటేశ్వర్లు, బచ్చు ఉమారాజు రాయల్, తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి పైకప్పు

- తృటిలో తప్పిన భారీ ప్రమాదం

ప్రజాశక్తి-కోవూరు

రెండు దశాబ్దాల క్రితం గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఓ ఇంటి స్లాబ్ అకస్మాత్తుగా కూలి ఇంట్లోని సామాన్లు పూర్తిగా ధ్వంసమైన సంఘటన వేగూరు గిరిజన కాలనీలో ఆదివారం చోటు

ఇంటి స్లాబు కూలడంతో ధ్వంసమైన సామాను

చేసుకుంది. మండలంలోని వేగూరు గిరిజన కాలనీలో నివసిస్తున్న ఈగ సుబ్బారావు సావిత్రమ్మలు కూలీనాలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ మేరకు ఆదివారం వారిరువురూ ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం ప్రాంతంలో స్లాబ్ ఒక్కసారిగా పెద్ద శబ్ధం చేస్తూ కూలిపోయింది. ఈ సంఘటనలో ఇంట్లో ఉన్న సామాన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది ప్రతిరోజు భార్యాభర్తలు ఇరువురు ఇంట్లోనే నిద్రించేవారు అదేస్లాబు రాత్రివేళలో కూలిఉంటే పెద్ద ప్రాణాపాయం సంభవించేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇంటిని చుట్టుపక్కల ప్రాంతాల నుంచి గ్రామస్తులు వచ్చి పరిశీలించి అయ్యో అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు మండలంలో ఉన్న గృహాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మహారాజశ్రీ గూడూరు జూనియర్ సివిల్‌జడ్జీ వారి కోర్టులో
E.P. NO. 53/2023
O.S. NO. 387/2022
పాలవల్లి ప్రమీల - D.H.R.
VS
K.నాగమణి @ K.N.నాగమణి - J.D.R.
వేలం ప్రకటన
పై నెంబరున డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టు కొనుటకు జె.డి.ఆర్. తాలూకు ఈ క్రింది షెడ్యూల్ దాఖల స్థిరాస్తిని తే03-02-2025 దిన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00గంటల లోపు పైకోర్టులో బహిరంగ వేలంపాట జరుపబడును. కావున పాటదారులు ఎవరైనా వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.
షెడ్యూలు
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ –గూడూరు సబ్ రిజిస్ట్రేషన్–మనుబోలు మండలం – మనుబోలు గ్రామం,పట్టా నెం.515–సర్వే నెం.220/2A1 –కోదండరామపురం ఏరియా–అసిస్‌మెంట్ నెం.775 – మొత్తం 105 1/2 అంకణాలు అందులో అమ్మివేసినది పోనూ మిగిలి వున్న స్థలం 7 అంకణముల ఖాళీ స్థలం అందులో కొంత ఐరన్‌షీట్ షెడ్ సర్వహక్కులతోటి ఈ క్రింద కనుబరిచిన హద్దులలో **హద్దులు:– తూర్పు** : N.H.16 రోడ్డు (పాత GNT రోడ్డు), **దక్షిణం** : ప్రతివాది యొక్క ఖాళీ స్థలం, **పడమర:** ప్రతివాది యొక్క ఇల్లు, **ఉత్తరం:** 15 అడుగుల వెడల్పు కలిగిన రాకపోకలకు దారి, ఈ హద్దులలో 7 అంకణముల స్థలం అందులో ఐరన్‌షీట్‌షెడ్.
మార్కెట్ విలువ : 14,00,000/-
అమీనా విలువ : 14,00,000/-
ఇట్లు
A.V. రాఘవరెడ్డి
DHR తరఫున న్యాయవాది, గూడూరు
సెల్ : 9440421733